షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 29 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 29 October 2024 PAGES : 8 PRICE : 5/-

# హాట్ టాపిక్‌గా కేసీఆర్ మౌనం

- ఉద్యమ సమయం నుంచి కూడా కేసీఆర్ ఎక్కువగా మీడియాలో కనిపించేందుకు ఇష్టపడరు.
- పార్టీ క్యాడర్‌కు బలమైన సందేశం ఇవ్వాలనుకుంటే..జోష్ నింపాలనుకుంటే సమయం, సందర్భం చూసి మాట్లాడుతారు.
- సరైన సమయం చూసి ఎంటర్ అవుతారు
- ఇలా దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన మౌనంగా ఉన్నా వార్తే?
- నోరు తెరిచినా వార్తే అనేలా సాగాయి తెలంగాణా పాలిటిక్స్
- పదేళ్ల అధికారం తర్వాత ప్రతిపక్షంగా బిఆర్ ఎస్ మారిన తర్వాత నుండి కేసీఆర్ సైలెంట్ అయిపోయారు



హైదరాబాద్

రాజకీయ వ్యూహాల్లో కేసీఆర్ మౌనం ఓ హాట్ టాపిక్. ఉద్యమ సమయం నుంచి కూడా కేసీఆర్ ఎక్కువగా మీడియాలో కనిపించేందుకు ఇష్టపడరు. సందర్భం వచ్చినప్పుడు..తాను మాట్లాడక తప్పదనుకున్నప్పుడు మాత్రమే ఆయన మీడియా ముందుకు వస్తారు. పార్టీ క్యాడర్‌కు బలమైన సందేశం ఇవ్వాలనుకుంటే..జోష్ నింపాలనుకుంటే సమయం, సందర్భం చూసి మాట్లాడుతారు. సరైన సమయం చూసి ఎంటర్ అవుతారు. ఇలా దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన మౌనంగా ఉన్నా వార్తే? నోరు తెరిచినా వార్తే అనేలా సాగాయి తెలంగాణా పాలిటిక్స్. పదేళ్ల - మిగతా3లో



## ఫుట్‌బాల్ అంటే మాకూ ఇష్టమే

- మ్యాచ్ సందర్భంగా స్పెయిన్‌లో మాదిరిగానే భారతీయులు కూడా ఎంతో ఉద్విగ్నతకు లోనయ్యారు
- మ్యాచ్ ఫీవర్ భారత్‌లోనూ ఉంది
- "భారతీయులు స్పానిష్ ఫుట్‌బాల్ ఆటను ఎంతో ఇష్టపడతారు.
- స్పెయిన్ తో బంధం బలోపేతం..
- ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు



## తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా మారుస్తాం

- ఆయిల్ పామ్ సాగుకు 31 జిల్లాల్లో అనుమతులు ఉన్నాయి
- ఆయిల్ ఫెడ్‌తో పాటు 14 ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ బాధ్యతలు
- తక్కువ ఎత్తు కురచ ఆకు ఎక్కువ దిగుబడులు ఇచ్చే ఆయిల్ పామ్ మొక్కల రకాల కోసం మలేషియాలో వెతికాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు

భద్రాద్రి కొత్తగూడెం

మలేషియా పర్యటనపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. మలేషియాలో ఆయిల్ పామ్ సాగు సాంకేతిక పద్ధతులు ప్రాసెసింగ్ ప్లాంట్స్...రిఫైనరీ ప్లాంట్స్ పరిశీలించినట్లు వివరించారు. మలేషియా - మిగతా3లో



## రాజకీయ వర్గాల్లో కూడా న్యాయవ్యవస్థ పట్ల ఎంతో గౌరవం ఉంది

- రిటైర్‌మెంట్ కు కొన్ని రోజుల ముందు సుప్రీం సీజే ఆసక్తికర వ్యాఖ్యలు
- గణేశ్ పూజ కోసం ప్రధాని మోదీ తన నివాసానికి రావడంపై మాట్లాడిన చంద్రచూడ్
- అలాంటి సమావేశాలలో న్యాయపరమైన విషయాలే చర్చించబోమని వెల్లడి
- న్యాయవ్యవస్థ బడ్జెట్ రాష్ట్రం నుంచే వస్తుంది
- కానీ ఈ బడ్జెట్ జడ్జిల కోసం కాదు

## రాష్ట్రంలో బలహీన పడిన ఆవర్తనం

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- గత నాలుగు రోజుల క్రితం ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారింది
- మరింత బలహీనపడి ఆవర్తనంగా మారినట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడి
- తెలంగాణతో పాటుగా ఏపీలోనూ వర్షాలు కురిసే అవకాశం లేదు



హైదరాబాద్

బంగాళాఖాతంలో గత నాలుగు రోజుల క్రితం ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారింది. అది మరింత బలహీనపడి ఆవర్తనంగా మారినట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఇది ఒడిశా తీర ప్రాంతంపై కొనసాగుతుందని చెప్పారు. అయితే ఈ ఆవర్తనం మరింత బలహీన పడటం వల్ల వర్షాలకు ప్రస్తుతం - మిగతా3లో



## కెనడాలో టెస్లా కారు ప్రమాదం..

- నలుగురు భారతీయులు మృతి
- ప్రయాణిస్తున్న కారు.. హైవేపై ఉన్న గార్డ్ రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో మంటలు
- లేక్ షోర్ బౌల్‌వార్డ్ ఈస్ట్, చెర్రీ స్ట్రీట్ వద్ద గత గురువారం ప్రమాదం జరిగినట్లు టొరంటో పోలీసులు వెల్లడి

## కుల గణన ఉంటుందా లేదా?

- ఓబీసీ లెక్క తేలుతుందా లేదా?
- 2025 నుంచి 2035, ఆ తర్వాత 2035 నుంచి 2045 అన్న రీతిలో లెక్కింపు ప్రక్రియ మారుతుందని ఓ ప్రభుత్వ అధికారి వెల్లడి
- జాతీయ జనాభా రిజిస్టర్‌ను త్వరలోనే చేయనున్న అప్‌డేట్
- 2026 నాటికి జనాభా లెక్కల వివరాలను వెల్లడించనున్నారు.



## ఖానా పురం నర్సంపేట జాతీయ రహదారిపై నెల రోజులుగా వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించని పట్టించుకోని అధికారులు





షణ్ముఖ వెలుగు ఖానా పురం ప్రతినిధి అక్టోబరు 28

ఇంటింటికీ త్రాగు నీరు అందించే మిషన్ భగీరథ గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఖర్చుతో మిషన్ భగీరథ పథకంపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నర్సంపేట నియోజకవర్గ ఖానా పురం మండల కేంద్రంలోని గ్రామ శివారులో ఎల్తి రాజు గౌడ్ ఇంటి సమీపంలో మిషన్ భగీరథ పైపు లైన్ పగిలింది. పైపు లైన్ పగిలి నెల రోజులుగా నీరు వృథాగా పోతుంది ఖానా పురం- నర్సంపేట జాతీయ రహదారి వెంట మిషన్ భగీరథ నీరు కాలువలా ప్రవహిస్తున్నప్పటికి సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి నీరంతా వృథాగా రోడ్డుపైన కాలువలా కనిపిస్తుంది మరి కొంత నీరు సైడ్ కాలువలో నుంచి సమీపంలోని పంట కాలువలో పడి పోతున్నాయి. సుమారుగా రెండు మూడు మోటార్ల నీరు వృథాగా పోతుంటే అధికారుల దృష్టి పడక పోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. పైపులైన్ పగిలిన విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్ లైన్ కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



## నాలుగోసారి కూడా మోదీనే ప్రధాని

- బీహార్ సీఎం నితీష్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు
- నాలుగోసారి ప్రధాని చేసేందుకు కట్టుబడి పనిచేయాలని పార్టీ నేతలకు పిలుపు
- మోదీ ప్రధాని అయిన నాటి నుంచి ప్రత్యేక ప్రేమను చూపుతూ మద్దతిస్తున్నారని ప్రశంస
- ఇటీవల జరిగిన ఎన్డీయే భేటీలో ఆసక్తికర వ్యాఖ్యలు

## దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో కాలం చెల్లిన అనుమతులతో అక్రమ నిర్మాణాలు

షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి అక్టోబరు 28



అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నా మున్సిపల్ అధికారుల తీరు మారడం లేదు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట లో అనుమతులకు మించి భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నా మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కింది స్థాయి సిబ్బంది కను సన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయితీ పదవీ కాలం ముగిసి 6 సంవత్సరాలు పూర్తి అయినా పంచాయితీ అనుమతులు తో అక్రమ నిర్మాణాలు జగతున్న తీరు అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది కాసులకు కక్కుర్తి పడుతున్న మున్సిపల్ సిబ్బంది అక్రమ నిర్మాణ దారులకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మల్లంపేట సాయి బాలాజీ, మాదాస్ కాలనీ కెవిఆర్ కాలనీ మాదాస్ రామచంద్రయ్య కాలనీలలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. నాయకుల సిఫార్సు తో కూల్చిన చోట అక్రమ నిర్మాణాలు జరుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణాలపై అధికా రులు చర్యలు తీసుకోవాలని విమర్శలు వినిపిస్తున్నాయి.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్

# స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలి

**ఎబివిపి జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్**



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి అక్టోబరు 28:** ఎబివిపి కోరుట్ల నగర శాఖ మీడియా సమావేశంలో జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్ లను వేంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు సంవత్సరాల తరబడి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్ లను విడుదల చేయని కారణంగా దాదాపు 7,500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం అవుతున్నా పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారాయని మండిపడ్డారు. పేద విద్యార్థులకు సంజీవని ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్ పథకానికి తూట్లు పొడుస్తూ విద్యార్థుల హక్కు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్ లను విడుదల చేయకపోవడం పేద విద్యార్థులను విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండిపడ్డారు. డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వేలాది మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్ రాని కారణంగా కాలేజీల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గు చేటు అని ఒక వైపు రీయింబర్స్మెంట్ ఉన్నా బకాయిలు చెల్లిస్తే తప్ప కళాశాలలు నడపలేని స్థితిలో ఉన్నామని ప్రైవేటు కాలేజీ ల యాజమాన్యాలు మొర పెట్టుకుంటున్నాయి ఫీజు రియంబర్స్మెంట్ పైన ఆధారపడి నడిపిస్తున్న కళాశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి మధ్యలోనే కళాశాల యాజమాన్యాలు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తుంది. ఇటు యాజమాన్యానికి అటు ప్రభుత్వానికి మధ్యలో బలవుతున్నది విద్యార్థులే డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికెట్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్న విద్య వ్యవస్థ తీరు మారడం లేదు విద్యార్థుల జీవితాలు బాగుపడటం లేదు. ఉన్న విద్యాలయాలను విద్యావ్యవస్థను పటిష్ట పర్చాల్సిన ప్రభుత్వమే విద్యను అంధకారంలోకి నెట్టి వేస్తూ నూతనంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ యూనివర్సిటీలు అంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకుంటుంది తప్ప ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదు. ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ లోనే అవగతం అవుతుంది. సంవత్సరాల తరబడి అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్న, అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు. ప్రభుత్వం ఇచ్చేటటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విద్యార్థుల యొక్క హక్కు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎబివిపి డిమాండ్ చేస్తుందని అన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఎబివిపి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు మణిదీప్ మనీష్ నగర సంయుక్త కార్యదర్శి పవన్ సాయి బ్రహ్మ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 26 వ సారి రక్త దానం చేసిన ఎ ఎస్ ఆర్

# సేవా సంస్థ నిర్వాహకులు ఎర్ర బోయిన రాజశేఖర్

**అభినందించిన ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్**

**షణ్ముఖ వెలుగు ఖానా పురం ప్రతినిధి అక్టోబరు 28:** ఒకరి రక్త దానం మరొకరికి ప్రాణం పోస్తుందని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నర్సంపేట సిటిజన్స్ క్లబ్ లో సోమవారం డీసీపీ మాట్లాడుతూ రక్త దాన శిబిరాన్ని నర్సంపేట సబ్ డివిజన్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి రక్తదానం చేయవచ్చు అని అన్నారు. రక్త దానం లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. రక్త దానం నిండు ప్రాణాన్ని కాపాడిన వారవుతారని తెలిపారు. యువత పోలీస్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. 26 వ సారి రక్త దానం చేసిన ఎ ఎస్ ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్ర బోయిన రాజశేఖర్ ను డీసీపీ రవీందర్ అభినందించారు. ఖానా పురం మండల కేంద్రానికి చెందిన గుండ్ల పెల్లి విజయ్ కుమార్ గౌడ్ రక్త దానం చేయగా ఎస్సై రఘుపతి అభినందించి సర్టిఫికేట్ ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ కిరణ్ కుమార్ సీఐ లు సాయి రమణ రమణమూర్తి చంద్రమోహన్ సాయిరాం ఖానా పురం ఎస్ ఐ రఘుపతి ఎస్సై లు రవికుమార్ మహేందర్ రాజేష్ వెంకటేశ్వర్లు డివిజన్ పోలీసులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



### నాణ్యమైన పోషకాహారం అందిస్తున్న అంగన్ వాడి కేంద్రం



**షణ్ముఖ వెలుగు బాసర ప్రతినిధి అక్టోబరు 28:** నిర్మల్ జిల్లా బాసర మండలం కీర్గుల్ కె గ్రామంలో తెలంగాణ లోని విద్యార్థులకు మంచి విద్య, మెరుగైన వసతి, మంచి భోజనం పెట్టాలని, భావి తరాలు ఆరోగ్యంగా, ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన విద్యార్థులపై పెట్టే ఖర్చును భావి తరం బాగుకోసం పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం అలాగే అంగన్వాడి కేంద్రంలో యుపిఎస్ స్కూల్ లో నాణ్యమైన భోజనం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థుల వలసలు పెరుగుతున్నాయి. నాణ్యమైన విద్యావిధానం, ఇంగ్లిష్ మీడియంలో బోధన సన్నబియ్యం తో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం వంటి విద్యాభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగింది అని అంగన్వాడి టీచర్ ఈశ్వర బాయి తెలిపారు.

## గ్రామాల్లో విలేజ్ డెవలప్ మెంట్

# కమిటి (వీడీసీ) లదే అధికారికం

**చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు**

**జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



**షణ్ముఖ వెలుగు కుబీర్ ప్రతినిధి అక్టోబరు 28:** నిర్మల్ జిల్లాలోని గ్రామ పంచాయితీ ల్లో ఎలాంటి అధికారిక ఉత్తర్వులు ప్రభుత్వ అనుమతులు లేకుండా విలేజ్ డెవలప్ మెంట్ కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రజలను భయ భ్రాంతులు కు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిర్మల్ జిల్లా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్ ఫైజాన్ హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్యక్రమాలు అమలు కాకుండా సదరు పథకాలు ప్ర జలకు అందుబాటులో లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా వివరిస్తున్న వారిపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వీరు అప్రజాస్వామికంగా కార్యకలాపాలు నిర్వహి స్తున్నట్లు జిల్లా యంత్రాంగం దృష్టికి రావడం జరిగిందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరకుండా ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టినా అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గత నాలుగు సంవత్సరాల నుంచి వీడీసీ సభ్యులు మాపై వివక్ష చూపిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ గ్రామ బహిష్కరణ చేసినందున వారిపై చర్యలు తీసుకోవాలని

తండ్రి పేరు :రాములు, గ్రామం రంజని మండలం కుబీర్ జిల్లా నిర్మల్ వాసిని. మా యొక్క గ్రామంలో గత 25 సంవత్సరాల క్రితం విడీసీ ఏర్పాటు చేయడం జరిగింది. గత నాలుగు సంవత్సరాల నుంచి నాపై మా యొక్క అన్నదమ్ములైన గంగా భూషణ్ పైన వివక్ష చూపిస్తూ కక్ష సాధింపు చర్యలు, చిత్ర హింసలకు గురి చేస్తున్నారు. దీనికి గత ముఖ్య కారణం.. మా యొక్క నానమ్మ దివంగత నర్సు బాయి, భర్త పేరు : భీమన్న గత 15 సంవత్సరాల క్రితం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 16 గుంటల భూమిని ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. మేము కాకుండా ఇతరులు కూడా ప్రభుత్వానికి భూమిని ఇవ్వడం జరిగింది. కానీ అక్కడ ఇళ్ల నిర్మాణం జరగలేదు. అట్టి ఖాళీ స్థలాన్ని వీసీడీ సభ్యులు అమ్ముకొని అనగా.. వెంచర్ రూపంలో అమ్ముకొని డబ్బులు వసూలు చేస్తున్నారు. 16 గుంటల భూమి పోను నాకు చెందాల్సిన భూమి 1.04 గుంటలు కలదు. కానీ అట్టి భూమి పట్టాకు కలదు. అసలు పాత భూమి కాస్తులో లేనందున స్థానిక ఎంపీ తహసీల్దార్ కు విన్నవించినా అధికారులు రాకుండా వీసీడీ సభ్యులు అడ్డుకుంటున్నారు. ప్రభుత్వ భూమిలో వెంచర్ చేసే సమయంలో నా పట్టాకు గల భూమిని కొలతలు జరిగిన తర్వాత మీరు ప్లాట్లు తీసుకోండని ప్రాధేయపడినా వీసీడీ సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక పండుగలకు చందాల రూపంలో డబ్బులు వసూలు చేసినా, ఇంటింటికీ చందాలు చేసినా మాకు మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వీడీసీ సభ్యులు వివక్షకు గ్రామ బహిష్కరణ చేశారు. ఈ విషయమై గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన కూడా స్పందించడం లేదు. ఇకనైనా మా యందు దయతలచి ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తమకు తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బాధితులు తెలిపారు

### షాపూర్ నగర్ అడ్డా మీది కార్మికుల కోసం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన రవి సింగ్

**బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్**





**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి అక్టోబరు 28:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ అడ్డమీది కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా బిపి షుగర్ కిడ్నీ లివర్ లాంటి పదహారు రకాల చికిత్స పరీక్షలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రవిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడుకి హెల్త్ కార్డ్స్ చేయించడం జరిగింది.. అలాగే ఆరు నెలలకు ఒకసారి చెక్ చేయించుకోవాలని ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని బీపీ షుగర్ ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ప్రతి ఒక్క కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలని ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న, శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రెటరీ లు కోశాధికారులు ఆర్గనైజర్స్, అడ్వైజర్స్ కమిటీ సభ్యులు మహిళలు వృద్ధురాలు వితంతువులు వికలాంగులు అదే విధంగా అనిల్ సుదర్శన్ జగన్ కిరణ్ తదితరులు పాల్గొనడం జరిగిందని అలాగే నిత్యం కార్మికులతోనే ఉంటూ భవన నిర్మాణ కార్మికులు ఏలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ఆరోగ్యంగా ఉండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని తెలిపారు ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొన్న లేబర్ అధికారులు డాక్టర్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

### పదవీ విరమణ చేసిన విద్యాధికారి దడిగల శంకరయ్య కు ఘనంగా వీడ్కోలు సన్మానం



**షణ్ముఖ వెలుగు మహాదేవ్ పూర్ ప్రతినిధి అక్టోబరు 28:** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్ పూర్ మండల విద్యాధికారి దడిగల శంకరయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవం బొమ్మ పూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు

**జిల్లా విద్యాశాఖ అధికారులు**

ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘం నేతలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా పిఆర్ టి యు ప్రధాన కార్యదర్శులు రాచర్ల శ్రీనివాస్ పసుల శంకర్ నేత విద్యాధికారి శంకరయ్య చేసిన సేవలను కొనియాడుతూ తాను అంచెలంచెలుగా మండల విద్యాధికారి గా ఎదిగిన తీరును గుర్తు చేసుకొని శంకరయ్య ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ కూడా విద్యనే ఆయుధంగా మలచుకొని మహోన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని తెలిపారు. బొమ్మ పూర్ గ్రామంలో సామాన్య అణగారిన వర్గానికి చెందిన దడిగల శంకరయ్య కష్టపడి ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించి తన పిల్లలను కూడా ప్రభుత్వ కొలువు ల్లో చేరే విధంగా ఉన్నత చదువులు చదివించడమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆదర్శనీయుడుగా పేరు తెచ్చుకున్నాడని కొనియాడారు శంకరయ్య ను సన్మానించిన వారిలో ఏ సి జి మండల రవీందర్ రెడ్డి భూపాలపల్లి చిట్యాల మండల విద్యాధికారులు దేవా నాయక్ రఘుపతి ప్రకాష్ బాబు మహాదేవ్ పూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బండం రాజిరెడ్డి పిఆర్టియు తెలంగాణ బాధ్యులు ఎల్కటి శరత్ శ్యామ్ కురుసం అనిల్ బోట్ల సాంబయ్య బిసిటియు జిల్లా అధ్యక్షులు రాచకొండ భాస్కర్ రాంబాబు దేవేందర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

### రేపాక (డి )గ్రామంలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి అక్టోబరు 28:** గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండలం డీ రేపాక గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు కృషి యూత్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రేపాక (డి) గ్రామంలో ఆదివారం రాత్రి మహాత్మా గాంధీ విగ్రహం పైన గుర్తు తెలియని దుండగులు దాడి చేశారని తెలిపారు. ఇలాంటి దారుణమైన చర్యలు ఎవరైతే చేస్తున్నారు వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి అసాంఘిక చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఇకపై ఇలాంటి చర్యలు చెయ్యాలనుకున్న దుండగులకు కఠినమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిమెంట్ బెంచి ల బహుకరణ



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు అక్టోబరు 28:** రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం హబ్సిగూడ హైదరాబాద్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం 6 సిమెంట్ బెంచీలు ను బహుకరించారు ఈ కార్యక్రమం లో డాక్టర్ ప్రవీణ్ కుమార్ గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి కరిపే నర్సింగ్ రావు కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి ల్యాబ్ టెక్నీషియన్ నరసయ్య హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పాత కొత్త దారాజ్ పల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చైర్మన్ వెంపేట నర్సారెడ్డి





**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి అక్టోబరు 28:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ మల్లాపూర్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంతో పాటు కొత్త దామరాజ్ పల్లి పాత దామరాజుపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను చైర్మన్ వేం పేట నర్సారెడ్డి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య పాక్స్ డైరెక్టర్లు నల్ల రాజారెడ్డి పుంద్ర లక్ష్మారెడ్డి కొత్తూరి నారాయణ ఎడ్ల కాశీ రాం నిగరాజం డైరెక్టర్లు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు

## నేడు జరగబోయే బీసీ రాజ్యాధికార సమితి సదస్సు ను విజయవంతం చేయండి

బీసీ రాజ్యాధికార సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్

**షణ్ముఖ వెలుగు మరిపెడ ప్రతినిధి అక్టోబరు 28:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు బలహీనవర్గాల నాయకత్వపు ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా గ్రామ స్థాయిలో బలమైన నాయకత్వ నిర్మాణం దిశగా బీసీ రాజ్యాధికార సమితి క్షేత్ర స్థాయిలో కమిటీల నిర్మాణం చేస్తున్నారు అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా పూర్తి స్థాయి కమిటీలను మంగళవారం ఉదయం ప్రకటించడంతో పాటు త్వరలో మహబూబాబాద్ లో నిర్వహించబోయే భారీ బహిరంగసభ వివరాలను మీడియాకు వెల్లడించనున్నారు

**కార్యక్రమ వివరాలు ::**

సమయం ఉదయం 11 గంటలకు వేదిక గోపి త్రివేణి నిలయం డిగ్రీ కాలేజ్ ఎదురుగా ఈదుల పూసపల్లి రోడ్డు మహబూబాబాద్ ఈ కార్యక్రమానికి బిసి రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు గండి వీరేంద్ర గౌడ్ రాష్ట్ర కార్యదర్శి ముంజల రాజేందర్ గౌడ్ జంపాల గోపి శ్రీధర్ ఇతర బీసీ నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

## ఉపాధిహామీ పని తనిఖీలు చేసిన అధికారులు



**షణ్ముఖ వెలుగు బాసర ప్రతినిధి అక్టోబరు 28:** నిర్మల్ జిల్లా బాసర ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో 1 ఏప్రిల్ 2023 నుండి 31 మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించామని,ఈ తనిఖీలో గుర్తించిన అంశాలను సామాజిక తనిఖీ ప్రజా వేదిక ద్వారా బహిర్గతం చేయటం జరిగిందన్నారు అధికారులు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు అధికారులు చెబుతూ ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరుగ లేవని సమాధానం ఇచ్చారు. డిఆర్డిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లు కు వచ్చే సంవత్సరం ఇంకా ఎక్కువ పని జరగాలని పని దినాలు కూడా కల్పించాలని వ్యక్తిగతమైన వర్క్ కూడా చేయాలని అనేక సూచనలు చేశారు.
ఎంపీడీవో అశోక్ కుమార్ ఇట్టి కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో ఎంపీవో హెచ్ ఆర్ మేనేజర్ ఏపీవో పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## శ్రీ విజయ దుర్గ టపాకాయల షాపును ప్రారంభించిన మేయర్ అమర్ సింగ్



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి అక్టోబరు 28:** పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్ ఉప్పల్ డిపోలో జట్ట కాంప్లెక్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజయ దుర్గ క్రాకర్స్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి అడ్వాన్స్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగ సమయంలో బాంబుల కాల్చేటప్పుడు క్రాకర్స్ శబ్దానికి ఎన్నో మూగ జీవాలు ఎన్నో పక్షులు చనిపోతున్నాయి. మనం చేసే పండుగ ఎవరికి హాని కలగకుండా సంతోషంగా జరుపుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి మధురెడ్డి క్రాకర్స్ షాప్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి అక్టోబరు 28:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం టిపియుయస్ (తపస్ )అధ్వర్యంలో సోమవారం మిగిలిన 4 డిఎ లు 2023 జూన్ నుండి రావాల్సిన పిఆర్ సి ఏర్పాటు గురించి, పెండింగ్ లో ఉన్న బిల్లులు,తదితర పెండింగ్ సమస్యల ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మెట్ పల్లి తహశీల్దార్ కార్యలయం లో డిప్యూటీ తహసీల్దార్ రాజ్ ముహమ్మద్ కు వినతి పత్రాన్ని తపస్ రాష్ట్ర నాయకులు ఎస్ పి లింబగిరి స్వామి,జిల్లా నాయకులు అంకతి లింగారెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ర్యాగల్ల మహేష్ మెట్ పల్లి మండలం అధ్యక్షులు నరసింహా చారిప్రధాన కార్యదర్శి మహేష్ జయెందెర్ మనోజ్ రాజ్ కుమార్ సతీష్ శ్యామ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# మేం ఎంతో మాకు అంత వాటా
# బీసీ మేలుకో రాజ్యం ఏలుకో







బీసీ రాజ్యాధికార సమితి మరిపెడ టౌన్ అధ్యక్షుడుగా అలువాల ఉమేష్ చందర్ నియామకం

**షణ్ముఖ వెలుగు మరిపెడ ప్రతినిధి అక్టోబరు 28:** బీసీలు ఐక్యతతో రాజ్యాధికారం సాధిస్తామని దీని కోసం బీసీలు అంతా కలిసి మరో ఉద్యమానికి నాంది పలకాలని బీసీ రాజ్యాధికార సమితి మరిపెడ టౌన్ అధ్యక్షుడు అలువాల ఉమేష్ చందర్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో కుమ్మరి సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బీసీ రాజ్యాధికార సమితి క్షేత్ర స్థాయి నాయకత్వ కమిటీల నిర్మాణ కార్యక్రమం అలువాల ఉమేష్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్ రాష్ట్ర కార్యదర్శి ముంజల రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు. యువ నాయకుడు అలువాల ఉమేష్ చందర్ ను మరిపెడ మండల బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడిగా నియమించారు అనంతరం ఉమేష్ చందర్ మాట్లాడుతూ బహుజన జాతులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకకు నెట్టివేయ బడ్డారని నా బహుజన జాతుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లు మే మెంతో.. మాకు అంత వాటా.. అనే నినాదం తో ముందుకు సాగుతామని మా లాంటి బీసీ యువకులు అగ్రకులాల కింద పనిచేయడం మానేసి బీసీల రాజ్యం కోసం రాజ్యాధికారం కోసం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు గండి విరేందర్ గౌడ్ మాట్లాడుతూ త్వరలో గ్రామ కమిటీల నియామకం జరుగుతుందని బీసీ యువకులంతా ఉత్సాహంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శామకూరి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా చెరుకూరి హరికృష్ణ మరిపెడ టౌన్ అధ్యక్షుడిగా అల్వాల ఉమేష్ చందర్ మండల సెక్రెటరీ నల్లబోతు ముస్తఫా యాదవ్ టౌన్ యూత్ అధ్యక్షులుగా వేమునూరు శ్రవణ్ సాయికుమార్ పటేల్ సాయి బింగి రమేష్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు నలబోతు వంశీ కృష్ణ బీసీ యువకులు తదితరులు పాల్గొన్నారు

## పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవాలి

బాసర ఎంఇఓ జి. మైసాజీ

**షణ్ముఖ వెలుగు బాసర ప్రతినిధి అక్టోబరు 28:** విద్యార్థులు పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని బాసర మండల విద్యాధికారి జి. మైసాజి అన్నారు. బాసర మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో యూఎస్ఏ పౌరుల ఆర్థిక సాయంతో నిర్వహించబడుతున్న రూమ్ టు రీడ్ ఇండియా స్పాన్సర్షిప్ ద్వారా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారన్నారు. కలర్ ఫుల్ పెయింటింగ్స్ ప్రత్యేక గ్రంథాలయ గది విద్యార్థులు చదువుకోవడానికి అనుకూలంగా టేబుళ్లు కార్పెట్ పుస్తకాలు అమర్చుకోవడానికి ర్యాక్స్ విద్యార్థులు గీసిన చిత్రాలు, రాసిన కథలు ప్రదర్శించడానికి పిన్బోర్డ్స్, తదితర సౌకర్యాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.
కార్యక్రమంలో ఎంఎన్ఓ నర్సారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నర్సయ్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజశ్రీ ప్రధానోపాధ్యాయులు బి. గంగారావు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డులు మంజూరు లో జాప్యం చేయడం సరికాదు

సంక్షేమ పథకాల కుదింపు కోసమే కాలయాపన
అడ్వకేట్ జగన్ మోహన్
బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇంచార్జీ

**షణ్ముఖ వెలుగు నిర్మల్ ప్రతినిధి అక్టోబరు 28:** ప్రజలకు రేషన్ కార్డులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుదింపు కొరకే రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని జగన్ మోహన్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో మీడియాతో అడ్వకేట్ జగన్ మోహన్ మాట్లాడుతూ.... కాంగ్రేసు ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, ఉప సంఘం కమిటీలు అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని, రేషన్ కార్డు మంజూరి లో ప్రభుత్వం కాలయాపన చేయడం సరైనది కాదని చేసే పనులు మానుకోవాలి అని ప్రభుత్వానికి ప్రజల సమస్యల పైన ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రేషన్ కార్డుల నోటిఫికేషన్ జారీ చేయాలని జగన్ మోహన్ అన్నారు.

ఎంతో మంది కొత్తగా పెళ్లయిన వారు,వలస వెళ్లిన వాళ్లు కొత్త రేషన్ కార్డుల కోసం చాలా మంది ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. అద్దె ఇంట్లో ఉన్న వారికి గృహ జ్యోతి వర్తించడం లేదని,గ్యాస్ సబ్సిడీ ఇటీవల రైతు రుణమాఫీ అన్నింటికీ కుటుంబం యూనిట్ రేషన్ కార్డు ఆధారం అంటూ కొర్రీలు పెట్టి, అనేక మందిని సంక్షేమ పథకాలకు దూరంగా ఉండేలా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు, సంక్షేమ పథకాలను కుదింపు కోసం కొత్త రేషన్ కార్డులు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు.
గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా తొమ్మిది సంవత్సరాలు రేషన్ కార్డులు మంజూరు కై జాప్యం చేసి ప్రజల వ్యతిరేకతతో కే సి ఆర్ ప్రభుత్వం గాలిలో కొట్టుకొని పోయింది.కాంగ్రెస్ సర్కారు అదే దారిన వెళ్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తోంది అని విమర్శించారు.



ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు రాష్ట్ర పరిపాలన సాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రేషన్ కార్డులు మంజూరు కై జాప్యం లేకుండా మంజూరు చేయాలని అన్నారు.ఏలాంటి ఆక్షేపణలు లేకుండా ప్రభుత్వం పథకాలు ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, పథకాలు ఇవ్వకుంటే ప్రజల కోసం ప్రజలతో పోరాటం చేస్తామని బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇంచార్జీ జగన్ మోహన్ అన్నారు.

## జమ్మికుంట ఎల్ ఐసి కార్యాలయం వద్ద ఎల్ఐసి ఏజెంట్ల శాంతియుత ధర్నా

**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి అక్టోబరు 28 :** ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్ పిలుపు మేరకు సోమవారం రోజున హుజురాబాద్ బ్రాంచి జమ్మికుంట స్థానిక ఎల్ఐసి కార్యాలయం ముందు ఎల్ఐసి ఏజెంట్లు శాంతియుత ధర్నా కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 1956 వ సంవత్సరం నుండి కండిషన్ ప్రకారం ఏజెంట్లకు 35 శాతం కమిషన్ ను 40 శాతానికి పెంచాలని అడిగే క్రమంలో 27 శాతానికి కుదించారని, ఒక సామాన్య పాలసీదారుడుకి ఒక సంవత్సరానికి ఒక లక్ష రూపాయిలు గా ఉన్న పాలసీని రెండు లక్షల రూపాయిలు గా సామాన్య ప్రజలపై భారం పెంచి ఉన్నత శ్రేణులకు మాత్రమే అవకాశం గా పాలసీ మారిందని పాలసీ దారుల అర్హత వయస్సు 55 సంవత్సరాలు ఉండగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం 50 సంవత్సరాలకు అర్హత వయసు కుదించిందని దీని వలన భారతదేశంలో కోట్ల మంది జనాభా 55 సంవత్సరాల లోపు ఉన్నవారు పాలసీలకు దూరమవుతున్నారని ఏజెంట్లు చేసిన పాలసీలు ఒక సంవత్సరంలో సరెండర్ చేస్తే ఇంతకు మునుపు వారికి కమిషన్ రికవరీ గా ఇచ్చే వారని ఇప్పుడు రికవరీ కూడా లేకుండా చేశారని పాలసీ దారులకు జీఎస్టీ లేకుండా అవకాశం కల్పించి, ఎల్ఐసి పాలసీ దారుల పెంపుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని, ఢిల్లీలో మంతనాలు జరపటానికి వెళ్లిన ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్ల డిమాండ్లను అంగీకరించాలని లేని పక్షంలో భారత దేశంలో ఉన్న 14 లక్షల ఎల్ఐసి ఏజెంట్లు ఏకమై అవసరమైతే ఆల్ ఇండియా ఎల్ఐసి నాయకుల పిలుపు మేరకు పార్లమెంటు ముట్టడి కైనా సిద్ధంగా ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు



# నువ్వు మోసం చేయనిది ఎవర్ని..?

-మొదటిపేజీ తరువాయి

మాయమాటలు చెప్పి నట్టేట ముంచారు. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనకు ఒక్క నెల మిగిలింది. కనీసం 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చావా..? నిరుద్యోగులను దగా చేశావు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో అడిగితే హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడారు. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తా అన్నావు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇప్పటి వరకు కూడా నయా పైసా ఇవ్వలేదు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ మానవీకోణంలో ఆలోచించి కొనసాగించారు. కరోనా కష్టకాలంలో కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఏడాదికి రూ. 2 వేల కోట్లు ఇచ్చారు కేసీఆర్. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే.. నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు ఇస్తానని మాటిచ్చావు. పెండింగ్‌లో బిల్లులు క్లియర్ చేస్తా అన్నావు. పీఆర్సీ ప్రకటించి వేతనాలు పెంచుతానని ప్రకటించావు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. పీఆర్సీ ఉలుకే లేదు. ఒక్క డీఏ ఇచ్చి దీపావళి పండుగ జరుపుకోండి అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిర్ణయించిన డీఏనే ఇప్పుడి స్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలు ఇచ్చింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండే.. కనీసం మూడు అయినా ఇస్తావు అనుకుంటే.. ఒక్క డీఏతో సర్దిపెడుతున్నావు. పీఆర్సీ ఇవ్వక, ఓపీఎస్ అమలు చేయక, 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు. 6 వేల మంది టీచర్లు పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.



మూడేండ్లకు నాలుగేండ్లకు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డి వికృత రూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు : హరీశ్‌రావు**

రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజాపాలన తొలగిపోయి.. కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయలైందని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.

రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన చూస్తే ప్రజా పాలన కాదు ప్రజా పీడనగా కనబడుతుంది. ప్రజా పాలన తొలిగిపోయి కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయటలైంది. ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయింది. సీఎం వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికి పోతోంది. ధర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..? ఎందుకు చర్చలు జరపడం లేదు. ఎందుకు తిరగబడుతున్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు. హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నవ్. ఇది సీఎం వైఖరి అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. కొత్త హామీల మాట అటుంచండి.. కేసీఆర్ మానవీయ కోణంలో పేదలు, ప్రజల కోసం తెచ్చిన పథకాను సీఎం రేవంత్ రెడ్డి కొనసాగించలేకపోతున్నారు. బతుకమ్మ చీరలు ఒకటి కాదు రెండు ఇస్తామన్నారు. కానీ అది కూడా ఇవ్వలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినప్పటికీ.. రైతుల కోసం రైతుబంధు అమలు చేసిండు కేసీఆర్. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతుబంధు ఇస్తా అని రేవంత్ రెడ్డి అన్నారు. ఒక్క పంటకు కూడా రైతు బంధు లేదు. పదిహేను వేలు కాదు కదా..? ఉన్న పదివేలు కూడా రావడం లేదు. చివరకు పంటలు కొనే దిక్కు లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. రూ. 7521కు క్వింటాల్ పత్తి కొంటామని మద్దతు ధర ప్రకటించారు. కానీ రైతులు రూ. 5500కు పత్తి అమ్ముకుంటున్న పరిస్థితి. మద్దతు ధర రాకపోతే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు. దిగాలుగా ఉన్న పత్తి రైతుకు.. అండగా నిలవడం లేదు. బోనస్ కాదు కదా.. మద్దతు ధర రావడం లేదు. వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మంలో రైతులు రోడ్డెక్కితే నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. కొబ్బరికాయలు కొడుతున్నారు.. కానీ ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. చివరకు వరి ధాన్యాన్ని రూ. 1900కు అమ్ముకుంటున్నారు. రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. మక్క రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. సోయాబీన్ రైతులను పట్టించుకోవడం లేదు. రైతులను రోడ్డు మీదకు తీసుకొచ్చిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలో దాపురించిందని హరీశ్‌రావు తెలిపారు.

# హాట్ టాపిక్‌గా కేసీఆర్ మౌనం

-మొదటిపేజీ తరువాయి

అధికారం తర్వాత ప్రతిపక్షంగా బిఆర్ ఎస్ మారిన తర్వాత నుండి కేసీఆర్ సైలెంట్ అయిపోయారు.పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొంత హడావుడి చేసినా? ఆ తర్వాత మళ్లీ మౌనం దాల్చారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నో ఇష్యూస్ ఉన్నాయి. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని బీఆర్ఎస్సే ఆరోపిస్తోంది. పైగా నాలుగు వేల పెన్షన్ అమలులోకి రాలేదు. హైడ్రా, మూసీ గొడవ అయితే రెగ్యులర్ అయిపో యింది. మరి ఇన్ని ఇష్యూస్ ఉన్నా కేసీఆర్ రియాక్ట్ కాకపోవ డానికి కారణం ఏంటన్న ది హాట్ టాపిక్గా మారింది. అధికార పార్టీకి టైమ్‌ఇస్తున్నారా..? సమయం కోసం ఎదురు చూస్తు న్నారా..? కేసీఆర్మౌనం ఎందుకంటూ అధికార కాంగ్రెస్లో.. ఇటు బీఆర్ఎస్ క్యాడర్, లీడర్లలో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత..కేటీఆర్, హరీశ్రావే పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. ప్రతీ రోజు పబ్లిక్లో ఉంటున్నారు. కానీ కేసీఆర్ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ప్రెస్ నోట్ కూడా రిలీజ్ చేయడం లేదు. దీంతో కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి ఎప్పుడు వస్తారన్నది ఆసక్తి రేపుతోంది. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌస్ లోనే పడుకుంటున్నారని అధికార పార్టీ విమర్శలు చేస్తున్నా మౌనమే ఆయన సమాధానమవుతుంది. లేటెస్ట్ గా మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి బ్లాస్టింగ్ న్యూస్ ఉంటుందని.. దీపావళి లోపు ఏదో సంచలనం జరగబోతుందన్నట్లుగా స్టేట్మెంట్ ఇచ్చారు.దీనిపై కేటీఆర్ స్పందించారే తప్ప..కేసీఆర్ మౌనం వీడటం లేదు. ఎమ్మెల్యేల వలస నుంచి ఇప్పుడు పొంగులేటి వ్యాఖ్యల వరకు అధికార పార్టీ బీఆర్ఎస్ను ఇరకాటంలో పెట్టాలని ప్రయత్నం చేస్తున్నా..కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదన్న చర్చ గులాబీ పార్టీలోనూ జరుగుతోంది. అయితే వచ్చే ఎన్నికల వరకు బీఆర్ఎస్ను నడిపించేది కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరేనా అన్న డిస్కషన్ వస్తోంది. కేటీఆర్, హరీశ్రావుకే గులాబీ దళపతి పార్టీ బాధ్యతలు అప్పగించారని..వాళ్లే అంతా చూసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది. తప్పదు అనుకున్నప్పుడు మాత్రమే కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఓ చర్చ జరుగుతోందిమరోవైపు కేసీఆర్ మౌనం వెనక ఉన్న కారణాలపై పొలిటికల్ ఎనలిస్టులు ఎన్నో రకాలు విశ్లేషిస్తున్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం ఇవ్వాలని గులాబీ బాస్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే రాష్ట్రంలో ఎన్నో ఇష్యూస్ ఉన్నా విపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సైలెంట్గానే ఉంటున్నారని చెప్పుకొస్తున్నారు. గడువు ఇవ్వకుండా ప్రభుత్వ వైఫల్యాలను విమర్శిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారట కేసీఆర్.మీడియా ముందు కనిపించకపోయినా ఫాంహౌస్ నుంచే పార్టీ నేతల ద్వారానే రాజకీయాలను నడిపిస్తున్నారు కేసీఆర్. సీఎం రేవంత్ రెడ్డి సహా నేతలంతా కేసీఆర్ టార్గెట్గా రెచ్చగొట్టేలా విమర్శలు చేస్తున్నా కాంగ్రెస్ నేతల ట్రాప్లో పడటం లేదు గులాబీ దళపతి. అయితే మరో మూడు నెలల్లో సార్ ఫీల్డ్లోకి దిగుతారని చర్చించుకుంటున్నారు బీఆర్ఎస్ లీడర్లు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై డిసెంబర్ 7నాటికి ఏడాది పూర్తికానుంది. ఆ తర్వాతే కేసీఆర్ ప్రజా ఉద్యమాలకు మొదలుపెడుతారని అంటున్నారు.ఓ వైపు ప్రభుత్వ తీరుపై పోరాటం చేస్తూనే.. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టే వ్యూహరచన చేస్తున్నారట కేసీఆర్. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27వరకు సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీల నియామకాన్ని పూర్తి చేసి..ఇక ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారట. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా అమలు చేయని హామిలపై భారీ సభ నిర్వహించాలని కూడా గులాబీ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. సెంటిమెంట్లకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే కేసీఆర్ పీడ దినాలు అయిపోయాక సంక్రాంతి తర్వాత..ప్రజాక్షేత్రంలోకి దిగాలని నిర్ణయించుకున్నారట.

# పోలీస్ వర్సెస్ పోలీస్

**నల్గొండ :** కొండాపూర్ 8వ బెటాలియన్ ఎదుట పోలీసు కానిస్టేబుళ్ల ఆందోళన. డిచ్ పల్లి వద్ద రోడ్డుమీదికి వచ్చిన బెటాలియన్ కుటుంబ సభ్యులు. మామునూరులో నిరసన వ్యక్తం చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు.. ఇవి రెండు రోజులుగా మీడియాలో ప్రముఖంగా కనిపిస్తున్న, వినిపిస్తున్న వార్తలు.ఇక శనివారమైతే నల్గొండ జిల్లాలోని అనపర్తి బెటాలియన్ లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం వివాదానికి కారణమైంది. నల్గొండ రూరల్ ఎస్సై సైదా బాబును అరెస్టు చేయాలని కానిస్టేబుల్ నిరసనకు దిగడం సంచలనాన్ని కలిగించింది. “శాంతియుతంగా మేము నిరసన తెలుపుతున్నాం. మా కుటుంబ సభ్యుల మీద అసభ్యకరంగా మాట్లాడారు. నోటికి వచ్చినట్టు తిట్టారు. వెంటనే సైదాబాబును సస్పెండ్ చేయాలని” కానిస్టేబుల్ డిమాండ్ చేశారు. అయితే ఆ సమయంలో సైదాబాబు వద్దకు కానిస్టేబుళ్లు రావడంతో బెటాలియన్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత వారందరినీ అక్కడి నుంచి పంపించారు.. ఇలాంటి సంఘటనలు గత రెండు రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో చర్చ మొదలైంది. రాష్ట్రంలోని వివిధ బెటాలియన్లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబాలు “వి వాంట్ ఏక్ పోలీస్” డిమాండ్ చేస్తున్నాయి. గౌరప్రధమైన పోలీసు ఉద్యోగంలో ఉన్నవారు కూలీలుగా మారుతున్నారని.. వారితో అధికారులు వెట్టిచాకిరి చేస్తున్నారని కానిస్టేబుళ్ల భార్యలు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల, డిచ్ పల్లి, మామునూరు, కొండాపూర్ వంటి ప్రాంతాలలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏక్ స్టేట్ ? ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగానే తెలంగాణ రాష్ట్రంలోనూ ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని.. తమ భర్తలకు వెట్టి చాకిరి నుంచి మృతి కల్పించాలని కోరుతున్నారు. వాస్తవానికి పోలీసులుంటే క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారు. అలాంటి పోలీసులు ఆందోళనకు దిగడం నివ్వెర పరుస్తోంది. పోలీసుల్లో ఎన్నో విభాగాలు ఉంటాయి. అందులో బెటాలియన్ అనేది ప్రత్యేకంగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నక్సలైట్ల ఏరివేత లక్ష్యంగా బెటాలియన్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే తెలంగాణలో నక్సల్స్ సమస్య తగ్గిపోయిన తర్వాత బెటాలియన్ వ్యవస్థ ఒకప్పటిలాగా చురుకుగా పనిచేయడం లేదు. దీంతో వారిని వివిధ విధుల కోసం ప్రభుత్వం ఉపయోగిస్తోంది. అయితే పోలీసుల్లో మిగతా వారి కంటే ఎక్కువగా బెటాలియన్ విభాగంలో పనిచేసే వారికి జీతభత్యాలు అందేది బహిరంగ రహస్యమే. ఈ బెటాలియన్లో గ్రేహౌండ్స్ అనే విభాగానికి ఎక్కువగా చెల్లింపులు చేస్తారు. వీరికి ప్రత్యేకంగా భత్యాలు లభిస్తాయి.అయితే బెటాలియన్ లో పనిచేసే వారిని తరచూ వివిధ పోలీస్ స్టేషన్లు తిప్పడం.. సరిగ్గా సెలవులు ఇవ్వకపోవడం.. బెటాలియన్ లో జరిగే పనులు కూడా వారి ద్వారా చేయించడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళనకు కారణమవుతోంది. ఇటీవల కొన్ని బెటాలియన్ల పరిధిలో చావు దప్పులు కూడా కానిస్టేబుళ్లు చేయడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆగ్రహం తారస్థాయికి చేరింది. అందువల్లేవారు నిరసనకు దిగారు. ఏక్ స్టేట్ ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పోలీసు విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరుతున్నారు. అయితే గత కొద్దిరోజులుగా బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనలు తీవ్ర రూపు దాల్చాయి. వీటిని సహజంగానే ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి అనుకూల మీడియా ప్రధానంగా చూపిస్తోంది. దీంతో ఈ సమస్య ఒకసారిగా తీవ్రతను దాల్చుకుంది. మరోవైపు కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనలను నియంత్రించడానికి ఇతర పోలీసులు రంగంలోకి దిగాల్సి వస్తుంది. ఫలితంగా పోలీసు వర్సెస్ పోలీస్ అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కార మార్గంగా ప్రభుత్వం కానిస్టేబుళ్ళ బదిలీలను నిలిపివేసింది. సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని డిజిపి ప్రకటించారు.

**బెటాలియన్ పోలీసుల ఆందోళన ఎందుకు ఏక్ పోలీస్..**

ఏక్ పోలీస్.. అసలు నిబంధనలు ఏం చెబుతున్నాయో పరిశీలిస్తే.. తెలంగాణలో మొత్తం 13 బెటాలియన్లు ఉన్నాయి. వాటిలో అధికారులు, సిబ్బంది కలిసి ఒక్కో బెటాలియన్‌లో వెయ్యి మంది వరకు ఉంటారు. సాధారణంగా పోలీస్ శాఖలో సివిల్, ఆర్మ్డ్ రిజర్వు(ఏఆర్), స్పెషల్ పోలీసు విభాగాలు ఉంటాయి. నేర విచారణ, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర విచారణ, నేరాల నిరోధం, నేరస్తులను గుర్తించడం వంటి విధుల్లో సివిల్ పోలీసులు పనిచేస్తారు. ఇక బందోబస్తు విధులు నిర్వహించేది ఆర్మ్డ్ పోలీసులు. టీజీఎస్పీ పోలీసు సిబ్బంది శాంతిభద్రతల విధులు నిర్వహిస్తుంటారు. ఐదేళ్లు ఏఆర్‌లో పనిచేసిన తర్వాత తమను సివిల్‌లోకి మార్చాలని పోలీసులు కోరుతున్నారు. అయితే ఇందుకు రాష్ట్ర సర్వీస్ నిబంధనలు అంగీకరించవు.ఇక సెలవుల విషయంలో కూడా ఏఆర్ పోలీసుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. సివిల్ పోలీసులకు వారానికి ఒక రోజు సెలవు ఇస్తుండగా, ఏఆర్ పోలీసులకు మాత్రం మూడు వారాలకు ఒక రోజు సెలవు ఇస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తున్న బెటాలియన్ పోలీసులకు ఇప్పుడు సెలవులు కూడా రద్దు చేయడంపై వారి కుటుంబాలు రోడ్డెక్కుతున్నాయి. ఉద్యోగులు ఎవరికీ లేని విధంగా టీజీఎస్పీ సిబ్బందికి సరెండర్ లీవులు, అడిషనల్ సరెండర్ లీవులు మంజూరు చేశారు. పండుగలు, సెలవుల సందర్భాల్లో టీజీఎస్పీ సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండడంతో వీరికి ప్రత్యేక సెలవులు ఉంటాయి. ఇక వేతనాలు, భత్యాలు, ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో పోలిస్తే అధికంగా ఉన్నాయి. భద్రత, ఆరోగ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.యూనిఫాం ధరించే పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి. కానీ, బెటాలియన్ పోలీసులు కొందరు ఆందోళనతో ఆ శాఖకు మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. అన్నిరకాలుగా మిగతా పోలీసులకన్నా ప్రత్యేక సదుపాయాలు ఉన్నా.. సెలవుల విషయంలో పోలీస్ కుటుంబాలు రోడ్డెక్కడం వెనుక పోలీసులు ఉన్నారని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలోనే చర్యలకు ఉపక్రమించింది. 116 మంది బెటాలియన్ పోలీసులను విధుల నుంచి తప్పించింది.

## రాష్ట్రంలో బలహీన పడిన ఆవర్తనం..

-మొదటిపేజీ తరువాయి

అవకాశం లేదన్నారు. తెలంగాణతో పాటుగా ఏపీలోనూ వర్షాలు కురిసే అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో చల్లని గాలులు వీస్తూ.. క్రమంగా చలి పెరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే పగటి ఉష్ణగ్రోతలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొన్ని జిల్లాల్లో అయితే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలకు కూడా చేరుకుంటున్నాయి. తీవ్రమైన వేడి గాలులు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు.ఇక సాయంత్రం కాగానే వాతావరణం పూర్తిగా మారిపోతుంది. సాయంత్రం వేళల్లో, రాత్రి, తెల్లవారుజామున చలి తీవ్రత పెరుగుతోంది. ఉన్నట్లుండి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 18 డిగ్రీల కనిష్ఠానికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఇలాంటి వాతావరణమే ఉంది.

## రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

-మొదటిపేజీ తరువాయి

కార్యదర్శిగా ఆయేషా మస్రత్, డెయిరీ కార్పొరేషన్ ఎండీగా కె.చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.దిలీప్ కుమార్, ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీగా ఎస్.క్షితిజ, జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్‌గా సుభద్రాదేవి, వికారాబాద్ డీఎఫ్ఓగా జి.జ్ఞానేశ్వర్‌లను బదిలీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీగా కొర్రా లక్ష్మిని బదిలీ చేశారు. కొర్రా లక్ష్మికి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. క్రీడాశాఖ సంచాలకులుగా సోనీ బాలదేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా మారుస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఆయిల్ పామ్, వ్యవసాయ శాఖ మంత్రులను కలిశామని అన్నారు. ఇవాళ( భద్రాద్రి కొత్తగూడెం) జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ....తెలంగాణ మలేషియా మధ్య వ్యాపార వాణిజ్య అవకాశాలపై చర్చించినట్లు తెలిపారు.

**ఆయిల్ పామ్ సాగుకు 31 జిల్లాల్లో అనుమతులు ...**

తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు 31 జిల్లాల్లో అనుమతులు ఉన్నాయని తెలిపారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు 14 ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. తక్కువ ఎత్తు కురచ ఆకు ఎక్కువ దిగుబడులు ఇచ్చే ఆయిల్ పామ్ మొక్కల రకాల కోసం మలేషియాలో వెతికామని అన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా కోకో, వక్క, జాజికాయ, మిరియం సాగు చేయొచ్చని తెలిపారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలకు సబ్సిడీ ఇస్తామని అన్నారు. భారతదేశం ప్రతి ఏడాది లక్ష కోట్లు పైగా విలువైన వంట నూనెలు దిగుమతి చేసుకుంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తే దిగుమతులు అవసరం లేదని అన్నారు. మలేషియాలో ఆయిల్ పామ్ సాగులో తెలుసుకున్న అంశాలు ఇక్కడ రైతులకు వివరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

**దిగుమతి సుంకం పెంపుతో...**

మరోవైపు.. దిగుమతి సుంకం పెంపుతో పామాయిల్ పండించే రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.14,392గా ఉండగా.. అది టన్నుకు రూ.1,500 నుంచి రూ.1,700 వరకు అదనంగా పెరిగే అవకాశం ఉందని, వెరసి మొత్తంగా ఒక్కో ఆయిల్ పామ్ గెల ధర రూ.16,500గా పెరిగే అవకాశం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**పామాయిల్ సాగు విరివిగా చేపట్టాలి..**

తెలంగాణలో ప్రస్తుతం 44,400 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుంచి 2.80 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి వస్తుందని తుమ్మల తెలిపారు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో తెలంగాణలో పామాయిల్ సాగును పెద్ద ఎత్తున చేపట్టడానికి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయని వివరించారు. రైతులు పామాయిల్ సాగు విరివిగా చేపట్టాలని తుమ్మల పిలుపునిచ్చారు. కాగా ముడి పామాయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో రైతుల్లో నిరాశ నెలకొందని, ఈ పంట సాగు చేయాలనుకున్నవారిపై ప్రతికూల ప్రభావం చూపిందని అన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు అధిక ధరలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, దిగుమతి చేసుకుంటున్న ముడి పామాయిల్‌పై సుంకాన్ని పెంచాలని ఆ లేఖలో కోరారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్‌తోనూ తుమ్మల ప్రత్యేకంగా మాట్లాడారు. స్పందించిన కేంద్రం తాజాగా సుంకాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఒక్కటైన శ్రీనివాసులు...

**కరీంనగర్ :** శ్రీనివాస్ పేరుగల వారంతా ఏకతాటిపైకి వచ్చారు. కరీంనగర్ కు చెందిన వుట్కూరి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో మిత్రబృందంగా ఏర్పడ్డారు. శ్రీనివాస్ పేరుతో పదిమందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఆ పేరు గల వారిని అందులో చేర్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 4800 మంది శ్రీనివాసులు అయ్యారు.మూడు వాట్సాప్ గ్రూప్ లు ఏర్పాటు చేసి మానవ సేవే మాధవ సేవగా భావిస్తు సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ శ్రీనివాసుల సేవా సమితి (టిఎస్ఎస్ఎస్) రిజిస్టర్ చేసి ఏడాది పూర్తైన సందర్భంగా కరీంనగర్ లోని టిటిడి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.తలసేమియా బాధితల కోసం వందమంది రక్తదానం చేశారు. ఎస్పీ స్థాయిలో ఉన్న కరీంనగర్ పోలీస్ ట్రేనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రక్తదానం శిబిరాన్ని ప్రారంభించగా వందమంది శ్రీనివాసులు రక్తదానం చేశారు. రక్త ధానమే కాకుండా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.శ్రీనివాస్ పేరు గలవారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 4800 మంది ఉన్నట్లు గుర్తించారు. ఏపీ తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 వేల మంది శ్రీనివాసులు ఉన్నట్లు భావిస్తున్నారు. వారందరినీ టిఎస్ఎస్ఎస్ లోకి చేర్పించి రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. శ్రీనివాస్ పేరు గల వారు పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చేయుత అందించాలని, అదేవిధంగా సాటి మనిషికి సహాయపడే కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.శ్రీనివాస్ పేరు గలవారు వివిధ రంగాల్లో ఉన్నారు. డాక్టర్లు ఇంజనీర్లు, ఉద్యోగులు, వ్యాపారులు,దినసరి కూలీలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇలా శ్రీనివాస్ నామధేయం గల వారందరిని టిఎస్ఎస్ఎస్ గొడుగు కిందకు తెచ్చేందుకు వుట్కూరి శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు సమావేశానికి హాజరైన శ్రీనివాసులు. రాబోయే రోజుల్లో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, పేదలను ఆదుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.మొదటి వార్షికోత్సవం సందర్భంగా 3000 మందితో సమావేశం నిర్వహించిన శ్రీనివాసులు వచ్చే ఏడాది వరకు 10000 మంది శ్రీనివాసులతో సమావేశం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆచార్య దైవజ్ఞ శ్రీనివాస్ కాళేశ్వరం గారి ఆలోచనకు అనుగుణంగా శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో శ్రీనివాస్ నామదేయులు ఒక్క వేదిక పైకి రావడం గొప్ప విషయమన్నారు పిటిసి ప్రిన్సిపల్ శ్రీనివాస్. దీనిని ముందుకు తీసుకుపోవడానికి మన ఆరోగ్యం మన చేతులో అనే నినాదంతో చిరుధాన్యాలను ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు.

## పండ్ల దుకాణం పై దూసుకెళ్లిన కారు.. తప్పిన పెను ప్రమాదం

**నల్గొండ :** నేరేడుచర్ల లోని ప్రధాన చౌరస్తాలో ఆదివారం రాత్రి మిర్యాలగూడ నుండి వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా వస్తు ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసుకున్న పండ్ల దుకాణంపై కి దూసుకు వెళ్ళింది. ఈ ఘటనలో పండ్ల దుకాణం వద్ద నలుగురికి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన 108 లో ఆసుపత్రికి తరలించారు. పొనుగోడుకు చెందినదిగా అనుమానిస్తున్న వాహనం ప్రధాన కూడలి వద్ద జనసంచారం రద్దీగా ఉన్న సమయంలో వేగంగా రావడం.. పండ్ల దుకాణం పైకి దూసుకు వెళ్లడం..పక్కనే స్ట్రీట్ ఫుడ్ నిర్వహిస్తున్న ప్రాంతంలో పదుల సంఖ్యలో జనం అల్పాహారం స్వీకరిస్తున్న సమయంలో ఇలా జరగడంతో స్థానికులు ఆందోళన చెందారు.అయితే తృటి ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పండుగ సీజన్ కావడం ప్రధాన చౌరస్తా వద్ద పోలీసులు నియమించకపోవడంతో తర చుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com